జనం కోసం..
అక్షర సమరం

# ఇదీ సంగతి

స్పెషల్ ఎడిషన్
Epaper.Edisangathi.com

సంపుటి: 4 - సంచిక: 118 | 24 డిసెంబర్ 2025 | బుధవారం | 4 పేజీలు



## వసతి గృహంలో..
# విద్యార్థులతో వెట్టిచాకిరీ..!

(మర్రి కిరణ్, ఇదీ సంగతి)

◆ ఆర్మూర్ హాస్టల్ వార్డెన్ బరితెగింపు! ◆ ఎముకలు కొరికే చలిలో ట్యాంకులు కడిగిస్తున్న వైనం ◆ నిబంధనలు గాలికి!


అమ్మ నాన్నలకు దూరంగా, ఉజ్వల భవిష్యత్తు కోసం వసతి గృహాల్లో చేరుతున్న నిరుపేద విద్యార్థుల జీవితాలతో ఒక బాధ్యతాయుత అధికారి ఆటలాడుకుంటున్నారు. విద్య నేర్పించి ప్రయోజకులను చేయాల్సిన చేతులతో.. అత్యంత ప్రమాదకరమైన రీతిలో నీళ్ల ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బీసీ ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలో వార్డెన్ మచ్చేందర్ సాగిస్తున్న అక్రమాలు, నిర్లక్ష్యం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎముకలు కొరికే చలి తీవ్రత పెరిగింది. ఇలాంటి సమయంలో విద్యార్థులకు వెచ్చని ఆశ్రయం కల్పించాల్సింది పోయి, రెండంతస్తుల భవనం పైకి ఎక్కించి నీళ్ల ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నారు. భవనం అంచున ఉన్న ఆ ట్యాంకుల వద్ద పసిపిల్లలు ఏమరపాటున కాలు జారితే పరిస్థితి ఏమిటని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చదువుకోవాల్సిన పిల్లలను ఇంటి పనులకు, హాస్టల్ చాకిరీకి వాడుకుంటూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డెన్ మచ్చేందర్ తీరుపై గత కొన్నేళ్లుగా అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్న ఈయన.. ఆ పలుకుబడితో విధులకు సరిగ్గా హాజరు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. విద్యార్థులకు అందాల్సిన కాస్మోటిక్ చార్జీలను వారి ఖాతాల్లో వేయకుండా సొంతానికి వాడుకుంటున్నారని విద్యార్థులు స్వయంగా ఆరోపిస్తున్నారు. హాస్టల్ కు వచ్చే బియ్యం తరలింపులో అవకతవకలు, నాణ్యత లేని భోజనం, వెలగని లైట్లు, అపరిశుభ్రమైన బాత్రూంలతో వసతి గృహం నరకాన్ని తలపిస్తోంది. సమస్యలను అడిగితే విద్యార్థులను పరుష పదజాలంతో దూషించడం, విద్యార్థి సంఘాల నాయకులపై దుర్భాషలాడటం ఈయనకు నిత్యకృత్యంగా మారింది.

### రాజకీయ అండదండలతోనే అక్రమాలు?

గత ప్రభుత్వంలోని ఒక కీలక ప్రజాప్రతినిధి అండదండలతోనే మచ్చేందర్ ఇన్ని అక్రమాలకు తెగబడుతున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. చివరకు తాను నివసిస్తున్న ఇల్లు కూడా మామిడిపల్లిలోని ఒక వెంచర్లో పార్కు కోసం కేటాయించిన స్థలంలో నిర్మించుకున్నారని, దీనిపై గతంలో కాలనీవాసులు పెద్ద ఎత్తున గొడవకు దిగారని సమాచారం. గతంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ ఉదయ్ భాస్కర్ గారు తనిఖీలు చేసినా, ఏసీబీ దాడులు జరిగినా ఈ అధికారి తీరులో మార్పు రాకపోవడం గమనార్హం. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా, ఇలాంటి అధికారుల వల్ల పథకాల లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, విద్యార్థుల ప్రాణాలను ఫణంగా పెడుతున్న వార్డెన్ మచ్చేందర్ పై విచారణ జరిపి, తక్షణమే విధుల నుండి తొలగించాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## రాబోయే ఎన్నికలను కూడా సమర్ధవంతంగా నిర్వహించాలి

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)



గ్రామ పంచాయతీ ఎన్నికల తరహాలోనే రానున్న రోజుల్లో జరుగనున్న ఎం.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ ఎన్నికలను కూడా సమర్ధవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఎం.పీ.డీ.ఓలు, ఎం.పీ.ఓలు సక్సెస్ మీట్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తూ, ఎన్నికల విధుల నిర్వహణ పట్ల ప్రతి దశలోనూ అధికారులు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరికీ తగిన సలహాలు, సూచనలు అందిస్తూ జిల్లాలో ఎన్నికలను సజావుగా జరిగేలా కృషి చేసిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధులు ఎప్పుడు కూడా సవాళ్ళతో కూడుకుని ఉంటాయని అన్నారు. ఇదివరకు ఇవే ఎన్నికల విధులు నిర్వర్తించాము అని తేలికగా తీసుకోకుండా, ఎప్పటికప్పుడు ఎన్నికల విధుల విషయంలో అన్ని అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రతి అంశాన్ని శ్రద్ధగా ఆకళింపు చేసుకుని అప్రమత్తతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పని చేయడం వల్లే ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సజావుగా పూర్తి చేసుకోగాలిగామని అన్నారు. రానున్న ఎన్నికల విషయంలోనూ ఇదే స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీపీఓ శ్రీనివాస్ రావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సాయన్న, పంచాయతీ కార్యాలయ ఎ.ఓ రాజబాబు, డీ.ఎల్.పీ.ఓలు, ఎం.పీ.డీ.ఓలు, ఎం.పీ.ఓలు పాల్గొన్నారు.